సాక్షి పల్నాడు
శనివారం । 27 । జనవరి । 2024



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.వి. శేషసాయి శుక్రవారం దర్శించుకున్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000.గరిష్ట ధర రూ.4,300.మోడల్ ధర రూ.3,600 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సమష్టి కృషితో సమున్నతి



డీఎస్ఏ స్టేడియంలో జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, జేసీ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, అధికారులు

అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- మహిళలకు ఆర్థిక భరోసాతో పాటు మెరుగైన జీవనోపాధులు
- రైతుకు ప్రతిదశలోనూ అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులకు మహర్దశ
- 75వ గణతంత్ర వేడుకల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

సాక్షి, నరసరావుపేట: 'కొత్తగా ఏర్పడిన జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందించి పేదరికం రూపుమాపుతున్నాం. మహాత్ములు కలలుగన్న స్వాతంత్ర్య ఫలాలు, రాజ్యాంగ స్ఫూర్తితో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నాం. జిల్లా ప్రజలందరికీ 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు' అని పల్నాడు జిల్లాకలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో జరిగిన 75వ గణతంత్ర వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పల్నాడు జిల్లా ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. ప్రసంగం ఆయన మాటల్లో...

1,22,755 మందికి ఇళ్ల పట్టాలు..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ ఈ నెల 19న విజయవాడలో 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం శుభపరిణామం. 'నవ రత్నాలు పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా జిల్లాలో 1,22,755 మందికి ఇళ్లపట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందుకోసం రూ.433 కోట్లు ఖర్చుచేసి 2,970 ఎకరాల్లో 866 లేఅవుట్లను అభివృద్ధి చేసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశాం. జిల్లాలో ఇప్పటికే 156 రెవెన్యూ గ్రామాల్లో 4,20,401 ఎకరాల్లో రీసర్వే పూర్తయింది. రూ.1,524.4 కోట్లతో 399 సచివాలయాలు, రూ.69.98 కోట్లతో 321 ఆర్బీకేలు, రూ.53.9 కోట్లతో 308 వైఎస్సార్ క్లినిక్‌లు, రూ.13.54కోట్లతో 86 బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, రూ.26.24 కోట్లతో 164 డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలు జరుగుతున్నాయి. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద జిల్లాలో ఇప్పటివరకు రూ.531.18 కోట్లతో 2.29 లక్షల మందికి ఉచితంగా వైద్యం అందించాం. నాడు–నేడు ద్వారా 32 పీహెచ్‌సీలకు మరమ్మతులు, 8 కొత్త పీహెచ్‌సీల నిర్మాణం చేపట్టాం.

వ్యవసాయానికి అండ..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా జిల్లాలోని 2.79 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.1,636 కోట్ల పెట్టుబడి సాయం అందజేశాం. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా గత నాలుగేళ్లలో 1.42 లక్షల మంది రైతులకు రూ.170.86 కోట్లు పంపిణీ చేశాం. వరికపూడిశెల ప్రాజెక్టు ద్వారా రూ.340.26 కోట్లతో 24,900 ఎకరాలకు సాగునీరు అందించే తొలిదశ పనులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత నవంబర్ 15న ప్రారంభించారు. రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా.

విద్యారంగానికి పెద్దపీట

జగనన్న అమ్మఒడి పథకం ద్వారా జిల్లాలో 1.87 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ ఏడాది రూ.243.64 కోట్లు జమ చేశాం. నాలుగేళ్లలో జగనన్న విద్యా, వసతి దీవెన ద్వారా పేద విద్యార్థుల చదువుల నిమిత్తం తల్లుల ఖాతాల్లో రూ.551.3 కోట్లు జమ. నాడు–నేడు రెండో దశలో 907 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో రూ.306.95 కోట్లతో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. 1.8 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశాం. వైఎస్సార్ సామాజిక పింఛన్ కానుక ద్వారా జిల్లాలో 2.84 లక్షల మందికి రూ.84.85 కోట్లు ప్రతి నెలా పంపిణీ చేస్తున్నాం. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 95,534 మంది మహిళలకు రూ.179 కోట్ల ఆర్థిక సహాయం అందజేశాం. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 25,175 సంఘాలకు ఇప్పటివరకు రూ.764 కోట్లు పొదుపు ఖాతాలో జమచేశాం. ఉపాధి హామీ పథకం ద్వారా 77.28 లక్షల పని దినాలు కల్పించాం. ఖాతాలలో రూ.187.36 కోట్లు జమ చేశాం. జిల్లా లో 44 భారీ పరిశ్రమలు రూ.3,431.76 కోట్ల పెట్టుబడితో స్థాపించడంతో 16 వేలమందికి ఉపాధి లభిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాం ప్రసాద్, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ..

నరసరావుపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం పల్నాడు జిల్లా ఎస్పీ క్యాంప్ ఆఫీస్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేసి సిబ్బందికి గణతంత్ర శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్ర రాజు, క్రైం అదనపు ఎస్పీ ఎస్‌కే చంద్రశేఖర్, డీఎస్పీలు కేవీ మహేష్, పల్లపురాజు, బి.ఆదినారాయణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ షరీఫుద్దీన్, ట్రైనీ డీఎస్పీ జగదీష్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆకట్టుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం శకటం



ర్యాలీగా వెళ్తూ కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



స్కౌట్ విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సుపరిపాలన

మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లిలో జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే మన దేశానికి చాలా ప్రత్యేకత ఉందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వివిధ దేశాల్లో పర్యటించి అక్కడి పాలన, రాజ్యాంగంపై పూర్తి అధ్యయనం చేశారన్నారు. వాటన్నిటికీ మించి మేలైన మన దేశ విలువలు కాపాడేలా, అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా ఎంతో విలువైన రాజ్యాంగాన్ని ఈ దేశ పౌరులకు అందించారన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హక్కులు, విధులను అందించిందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ బద్ధంగా రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు వెలుగూరి శరత్, అచ్యుత శివప్రసాద్, తోట లక్ష్మీనారాయణ, తుమ్మల వెంకటేశ్వరరావు, జూపల్లి పాల్, మాదిగొండ నారాయణ తదితరులు ఉన్నారు.



మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిల్లపల్లి

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా చిల్లపల్లి మోహన్‌రావును నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. చిల్లపల్లి మోహన్‌రావును బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించారు.

ఆత్మాభిమానం నుంచే జాతీయ జెండా ఆవిర్భావం

పింగళి వెంకయ్య మనవడు జీవీఎస్ నరసింహం



పిడుగురాళ్ల: బ్రిటిష్ సామ్రాజ్యంలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల ఆత్మాభిమానమే ఆత్మగా మారి ఉద్భవించిందే జాతీయ జెండా అని జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మనవడు జీవీఎస్ నరసింహం అన్నారు. పట్టణంలోని ఏబీసీ సీబీఎస్‌సీ స్కూల్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవీఎస్ నరసింహం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తాతగారైన పింగళి వెంకయ్య జెండా రూపకల్పన చేయటమే కాకుండా స్వాతంత్ర్యం సమర యోధుడుగా జాతిపిత మహాత్మ గాంధీతోపాటు అనేక ప్రాంతాల్లో సంచరిస్తూ, దేశ సేవయే పరమవధిగా జీవించారని తెలిపారు. అనేక మందిలో దేశభక్తి రగిలించారన్నారు. అనంతరం పాఠశాల స్కూల్ డైరెక్టర్ జీకే అయ్యంగార్, ప్రిన్సిపాల్ రమాదేవి, శ్రీధర్ కుమార్‌లు జీవీఎస్ నరసింహంకు జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే నరసింహం చేతుల మీదుగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్టోపస్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆక్టోపస్ కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ(అడ్మిన్) ఎం.నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్పీ(ట్రైనింగ్) బి.రవిచంద్రకు ఉత్తమ సేవా పతకం, ఇన్‌స్పెక్టర్ కేవీపీ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లుకు సేవా పతకం, ఇన్‌స్పెక్టర్ ఆర్వీ నాయక్, కానిస్టేబుల్ ఎం.సూర్యనారాయణలకు డీజీపీ సిల్వర్ డిస్క్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మస్తానయ్య ఉరుసు మహోత్సవాలు



పాత గుంటూరు : జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్ షా 132వ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. దర్గాలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 28న నూతన చాందిని అలంకరణ, రాత్రి గంధం ఊరేగింపు, 29న గంధం పంపిణీ, దీపారాధన 30న ఖురాన్ పఠనం, బాబా వారి ప్రసాదం పంపిణీ 31న ఫకీర్లకు బాబా వారి శేష వస్త్రాల పంపిణీ 1న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు విశేష ప్రార్థనలు , భక్తులకున్న ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో దూండీశ్వరి, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు

35 మంది ఎంపీడీఓలకు స్థానచలనం

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 35 మంది ఎంపీడీవోలను వేర్వేరు జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఏ. సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఒకే స్థానంలో మూడేళ్లకు పైబడి పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 12 మందిని ఉమ్మడి కృష్ణా నుంచి 23 మందిని ఉమ్మడి ప్రకాశం జిల్లా జిల్లాకు బదిలీ చేశారు.

కూలిన బతుకులు..!

- పొట్టకూటికి వెళ్లి.. ప్రాణాలు వదిలి..
- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కూలీలతో వెళ్తున్న ఆటో
- ఒకే ఊరికి చెందిన ముగ్గురు మృత్యువాత
- ఒకరి పరిస్థితి విషమం.. 12 మందికి గాయాలు
- శోకసంద్రంగా వేలూరు గ్రామం



చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల బంధువులు





మృతులు శివపార్వతి, హనుమాయమ్మ (ఫైల్)

చిలకలూరిపేట, యడ్లపాడు: వారంతా వ్యవసాయ కూలీలు...రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలు. రోజుమాదిరిగానే ఉదయాన్నే కూలి పనులకు ఆటోలో బయలుదేరారు. కొద్దిసేపట్లోనే మృత్యువు వారిలోని ముగ్గురిని తన ఒడిలోకి చేర్చుకోగా.. మరో 13 మంది ఆస్పత్రి పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన 16 మంది వ్యవసాయ కూలీలు గ్రామం నుంచి ఆటోలో మిర్చి కోతల నిమిత్తం నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి శుక్రవారం బయలుదేరారు. ఆటో మార్గమధ్యంలోని గణపవరం డొంకనుంచి లింగంగుంట్ల గ్రామం వద్ద నరసరావుపేట రహదారిలోకి ప్రవేశిస్తోంది... సరిగ్గా అదే సమయంలో చిలకలూరిపేట వైపునకు ఆర్టీసీ బస్సు వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఆటోపైకి ఎక్కడంతో కూలీలంతా ఆటోలో చిక్కుకుపోయి హాహాకారాలు చేశారు. ఇది గమనించిన స్థానికులు పరుగున వచ్చి బస్సులోని జనాన్ని కిందకు దించి, ఆటోపై నుంచి బస్సును పక్కకు తొలగించారు. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కనే కూర్చున్న ఏకసిరి హనుమాయమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారిని 108 వాహనం సహాయంతో చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందులో గన్నవరపు శివపార్వతి(60) చికిత్స పొందుతూ మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన షేక్ హజరత్‌వలి, సరుగుల కోటేశ్వరమ్మలను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హజరత్‌వలి (60) కన్నుమూశాడు. కోటేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉంది. కాగా ఆటో డ్రైవర్ షేక్ సుభానితో పాటు గాయపడిన పాలెపు రజిని, ఎస్.పార్వతి, షేక్ వలిమా, బేతంచర్ల మల్లేశ్వరి, పాలెపు శారద, షేక్ జాన్‌బీ, షేక్ ఖాదర్‌బీ, షేక్ మహబూబ్‌బీ, షేక్ మస్తాన్‌బీ, గోరంట్ల శివకుమారి, షేక్ బాజీలకు చికిత్స అందిస్తున్నారు. బాధితులంతా వేలూరు గ్రామానికే చెందిన వారు కావడంతో ఆ గ్రామస్తులతో ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం నిండిపోయింది. మృతుల బంధువుల రోదనలతో విషాదఛాయలు అలు ముకున్నాయి. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సహృదయత చాటుకున్న మల్లెల...

సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. మృతి చెందిన కుటుంబాలకు తన వ్యక్తిగతంగా ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఒక్కొక్కరిదీ ఓ విషాద గాథ...

- శివపార్వతికి ముగ్గురు కుమార్తెలు. ముగ్గురికీ వివాహాలు అయ్యాయి. భర్త నాలుగేళ్ల కిందట కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఒక్కదానినే అన్న బాధను దిగమింగుకుని కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంది. సంక్రాంతి పండుగకు కుమార్తెలు రాకపోవడంతో దిగులుగా ఫోన్లు చేయడంతో గత ఆదివారం నాడు వచ్చి అంతా అమ్మను పలకరించారు. ఆరోజు తల్లి తమపై చూపించిన ఆప్యాయతే చివరిదని గ్రహించలేకపోయామంటూ కుమార్తెలు తలుచుకుంటూ కన్నీళ్లపర్యంతమయ్యారు. గాయాలతో ఆస్పత్రికి వచ్చాకా కడసారి చూస్తూనే కన్నుమూసిందయ్యా అంటూ రోదించారు.
- ఏకసిరి హనుమాయమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహాలు జరిగినా అంతా కలిసే ఉంటారు. అందరికీ ఒకటే కట్టు, ఒకటే మాట. అందరూ పనులకు వెళ్లొద్దన్నా.. ఊరికే కూర్చుంటే ఏమోస్తుంది నలుగురితో కలిసినట్టు ఉంటుంది. వచ్చే కూలి కుటుంబానికి కొంత చేదోడు వాదోడుగా ఉంటుందంటూ కొద్దికాలంగా గ్రామస్తులతో కలిసి మిరప కోతలకు వెళ్తుంది. ఇంటి పెద్దదిక్కు దూరమైందని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.
- మృతుడు షేక్ హజరత్‌వలి, సాబిరా దంపతులకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తాపీపనులు చేస్తూనే అందరికీ వివాహాలు చేశాడు. ఎవరి కుటుంబాలు వారివి అయ్యాయి. ప్రస్తుతం ఆయనకు భార్య పని చేసే పరిస్థితి లేదు. తనకు 70 ఏళ్లు రావడంతో తాపీ పనులు చేయలేక వ్యవసాయ పనులకు వెళ్తూ భార్యను పోషించుకుంటున్నాడు. కొద్దికాలం కిందట కొడుకు, ఇప్పుడు భర్త చనిపోవడంతో సాబిరా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కేఆర్ కల్పశ్రీ అసిస్టెంట్ కలెక్టర్ | కె.వినాయకం డీఆర్వో | రాఘవేంద్ర ఏఎస్పీ | రామచంద్రరాజు ఏఎస్పీ

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేసారు.

– నరసరావుపేట రూరల్



చంద్రశేఖర్ ఏఎస్పీ | ఎస్.రామచంద్రరావు డీఎఫ్‌వో | శేషిరెడ్డి, ఆర్డీవో, నరసరావుపేట | రమణకాంత్‌రెడ్డి ఆర్డీవో గురజాల | ఎస్.పద్మశ్రీ డీఎస్‌పీ | ఐ.మురళి జిల్లా వ్యవసాయ అధికారి | బెన్నీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి | సంజీవకుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి | జోసఫ్‌కుమార్ డ్వామా పీడీ | ఎస్.వేణుగోపాలరావు హౌసింగ్ పీడీ | ఎస్.పల్లవి స్టెప్ సీఈవో | కె.శామ్యూల్ డీఈఓ | డాక్టర్ బి.రవి డీఎంహెచ్‌ఓ | డాక్టర్ బి.వి.రంగారావు, వైద్యశాలల పర్యవేక్షణ



ఆంజనేయులు, జిల్లా మైక్రో ఇరిగేషన్ | రాజానాయక్, ఈఈ ఆర్‌అండ్‌బీ | వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ | వరలక్ష్మి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ | పరంధామరెడ్డి జిల్లా రవాణా అధికారి | బాలునాయక్ డీఆర్‌డీఏ పీడీ | కాంతారావు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి | ఎల్.వరలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి | సురేష్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూ ఎస్ | దుర్గాబాయ్, ఈడీ, బీసీ కార్పొరేషన్ | ఎం.విజయభాస్కరరెడ్డి, డీపీఓ | ఆదినారాయణ సత్తెనపల్లి డీఎస్పీ | కెవి మహేష్ నరసరావుపేట డీఎస్పీ | పల్లపురాజు గురజాల, డీఎస్పీ

క్లుప్తంగా

కోర్టు ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవం



నరసరావుపేట టౌన్: పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి పి.వి.ఎస్.సూర్యనారాయణమూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శోభారాణి, ఆశీర్వాదం పాల్, టి.ప్రవల్లిక, న్యాయవాద సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో తహసీల్దార్ రమణానాయక్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను డీఎస్పీ మహేష్ ఎగురవేశారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేశారు. కార్యక్రమంలో సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్, మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన గణతంత్ర వేడుకలు

ప్రభుత్వ విభాగాల శకటాలు ప్రదర్శన, ఉత్తమ శకటాలకు బహుమతులు అందజేత



అర్జున్ అవార్డు గ్రహీత జయ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ క్రీడా మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు సయ్యద్ జనాబ్ బేగం, బి.వెంకటలక్ష్మిలను జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ సత్కరించారు. ప్రముఖ అంధ క్రికెట్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత అజయ్‌కుమార్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సత్కరించారు. ముఖ్యఅతిథి ప్రసంగం అనంతరం వివిధ శాఖలు నిర్వహించిన శకటాల ప్రదర్శనలో విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి, వ్యవసాయ అనుబంధ శాఖల శకటానికి ద్వితీయ బహుమతి రాగా, గృహ నిర్మాణ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది. వేడుకలలో భాగంగా వివిధ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహుతులను అలరించాయి. చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన తల్లీ భారతి వందన నృత్యానికి ప్రథమ బహుమతి, రావిపాడు ఆక్స్‌ఫర్డ్ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన జడ కోలాటానికి ద్వితీయ బహుమతి రాగా శంకరభారతిపురం జెడ్పీహైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన పలనాడు పాట నృత్యంకు తృతీయ బహుమతి లభించింది. క్రీడా ప్రాగణంలో వివిధ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లలో ప్రథమ బహుమతి అటవీ శాఖ, రెండవ బహుమతి ఉద్యాన శాఖకు, తృతీయ బహుమతి జిల్లా నీటి యాజమాన్య శాఖకు లభించింది. కార్యక్రమంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో సిబ్బందికి ముఖ్యమంత్రి ఉత్తమ సేవ పురస్కారాలు లభించిన అమరావతి పల్లపురాజు, పి.శంకరరావు, జి.వి.యస్.ఆర్.ఆంజనేయులను సత్కరించి పురస్కారాలు అందచేశారు.

డీఆర్ఎం కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం

లక్ష్మీపురం: నేడు దేశంలో స్వేచ్ఛాయుత జీవితాన్ని గడుపుతున్నామంటే దానికి కారణం అమరవీరుల త్యాగఫలం అని గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక నల్లపాడులోని రైల్వే పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా డీఆర్ఎం రామకృష్ణ డివిజన్ సిబ్బంది, రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఐఆర్పీ సిబ్బంది సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వీరుల అడుగుజాడల్లో నడుచుకోవాల్సిందిగా సూచించారు. ఈ రోజు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు రైల్వే డివిజన్ మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శునకాల ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఆర్. శ్రీనివాస్, సైమన్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీకృష్ణకు గ్యాలంటరీ మెడల్



సత్తెనపల్లి: ఛత్తీస్‌ఘడ్ వద్ద కోబ్రా–210 విభాగంలో విధులు నిర్వహిస్తూ 2021 ఏప్రిల్ 3న మావోయిస్టుల ఘాతుకానికి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శాఖమూరి మురళీకృష్ణ వీర మరణం పొందిన విషయం తెలిసిందే. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన గ్యాలంటరీ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ మెడల్ కాపీని సీఆర్పీఎఫ్ కమాండెంట్ ఆర్కే పాండా శుక్రవారం సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో ఉన్న శాఖమూరి మురళీకృష్ణ ఇంటికి వచ్చి మృతుడి తల్లి విజయకుమారికి అందించారు. ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసిన శాఖమూరి మురళీకృష్ణ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమాండెంట్ ఎన్.పి.రజిత, సీఆర్పీఎఫ్ సిబ్బంది, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ పైడి రాంబాబు, సిబ్బంది, మురళీకృష్ణ తండ్రి రవీంద్రబాబు, సోదరుడు వెంకట మోహన్‌రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇండో–చైనా యుద్ధంలో అసువులు బాసిన సుబ్బారావు

62 ఏళ్ల తర్వాత వివరాలు సేకరణ

మార్టూరు: ఇండియా, చైనా దేశాల మధ్య 1962లో జరిగిన యుద్ధంలో బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన పుట్టా సుబ్బారావు వీరమరణం పొందారు. స్థానిక తూర్పు బజారుకు చెందిన పుట్టా తిరుపతయ్య, పున్నమ్మ దంపతుల కుమారుడు సుబ్బారావు దేశంపై ఉన్న మమకారంతో అప్పట్లో ఆర్మీలో చేరారు. ఇండియా–చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధంలో వీరమరణం పొందినట్లు ఆయన సమీప బంధువులు, స్థానికులు తెలిపారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సుబ్బారావు దేశభక్తిని, పోరాటపటిమను, మరణవార్తను స్థానికులు శుక్రవారం గుర్తు చేసుకున్నారు. 1962లో వీర మరణం పొందిన సైనికుడు సుబ్బారావు కుటుంబ వివరాలను, ప్రస్తుతం ఆయన పూర్వీకుల నుంచి ఆర్మీ అధికారులు 62 ఏళ్ల తరువాత గణతంత్ర వేడుకల సందర్భంగా సేకరించడం గమనార్హం.

ప్రతి పేదవానికి మెరుగైన ఆరోగ్యం లక్ష్యం

- రూ.8.80లక్షల సీఎం సహాయ నిధి కింద కేటాయింపు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి పేదవాడిని ఆరోగ్యపరంగా అన్నీ విధాలుగా ఆదుకోవటానికి ఆరోగ్యశ్రీ కింద వేలాది రోగాలకు ఉచిత వైద్యమందిస్తూ ఆ పరిధిలోకి రాని వారికి రూ.8.80లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మాచర్ల నియోజకవర్గంలోని అనారోగ్యానికి గురైన నలుగురు అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు అందజేశారు. క్యాంపు కార్యాలయంలో ఆయన బాధిత కుటుంబాలు చెందిన చింతా నరసమ్మకు రూ.1,30,000, నల్లి అర్జున్ రూ.60,000, నాగెండ్ల ఆంజనేయులు రూ.4,50,000, పోరురెడ్డి లక్ష్మారెడ్డి రూ.2,40,000, సీఎం సహాయ నిధి కింద చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజక వర్గంలో సీఎం సహాయ నిధి కింద ఆయా కుటుంబ సభ్యులు రూ.3కోట్ల సహాయ నిధి కింద అందజేయటం జరిగిందన్నారు. వేలాది మందికి ప్రయోజనం కల్పించి ఏ ఒక్క పేద కుటుంబం ఆరోగ్యపరంగా మృతి చెందకూడదని సీఎం జగన్ తీసుకున్న చర్యల వల్లే ఇన్ని కోట్ల రూపాయలు బాధితులకు అందజేయటం జరుగుతుందన్నారు. పేదలందరు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాలతో పాటు ఆయా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

400 మందికి భూ, ఇంటి పట్టాలు పంపిణీ



భూ పట్టాలు పొందిన మహిళలతో ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి నిరుపేద ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలను చేపట్టి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబులేశునిపల్లెలో నిర్వహించిన భూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓబులేశునిపల్లె, రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా రూ.30కోట్ల లబ్ధి చేకూరిందని గణాంకాలతో వివరించారు. ఓబులేశునిపల్లెలో జగనన్న సంపూర్ణ దళిత హక్కు పథకం కింద 152 మందికి 151.79 యకరాలకు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. ఇదే గ్రామానికి చెందిన 2003 కి ముందు డికె పట్టాలు పొందిన ఎస్సీ, ఎస్టీలు 73 మంది 86.31 ఎకరాలు ప్రభుత్వ నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టాలిచ్చారు. జగనన్న నవరత్నాలు పథకం కింద ఓబులేశునిపల్లె, రాజానగరంలో 252 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కొత్తగా ఓబులేశునిపల్లె, నిదానంపాడు గ్రామాల ఎస్సీ, ఎస్టీలు 166 మందికి 241.53 ఎకరాలకు పట్టాలిచ్చారు. ఆయా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ విప్ పీఆర్కేకి జేజేలు పలికి తమ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం రమేష్‌కుమార్, ఏఓ వై అమీర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఎస్ వెలుగొండారెడ్డి, మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం పలువురు వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జగనన్న స్ఫూర్తితో బజరంగ్ సేవ

- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో రెండవ రోజు 1121 మందికి నేత్ర, గుండె వైద్య పరీక్షలు



వైద్య శిబిరానికి వచ్చిన చేబ్రోలు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాల స్ఫూర్తిగా బజరంగ్ ఫౌండేషన్ జగన్నామ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు హైస్కూల్ రోడ్డు సమీపంలో జీబీసీ రహదారి పక్కన జగన్నామ సంక్షేమ సంగమం శిబిరం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం 1121 మందికి పైగా కంటి, గుండె పరీక్షలు చేయించుకున్నారు. వీటితోపాటు ఫిజియోథెరిపీ సేవలను వినియోగించుకున్నారు. తొలిరోజు గురువారం 1287 మంది బజరంగ్ సేవలను వినియోగించుకున్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ యాంజియోగ్రామ్ అవసరమైన వారిని సోమవారం ఉదయం ప్రత్యేక వాహనంలో విజయవాడ తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఉచిత నేత్ర వైద్య పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్ల పంపిణీ, మీ గుండె పదిలం కార్యక్రమంలో ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయిస్తామని తెలిపారు. దివ్యాంగ దర్శినిలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్‌లు సమకూరుస్తున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు 87 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని త్వరలో మరికొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాలను విస్తరిస్తామని తెలిపారు. కుల,మత,వర్గ, రాజకీయాలకతీతంగా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.



పిడుగురాళ్ల పట్టణంలో నాల్గవ దఫా వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.



సమావేశానికి హాజరైన మహిళలు – పిడుగురాళ్ల